ప్రజాశక్తి
శుక్రవారం 13 జనవరి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

కాంట్రాక్టు ఉద్యోగులను
రెగ్యులర్ చేయాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

మీగడ వెంకటేశ్వరరెడ్డి



ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో గత పదేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి.. గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ యూనివర్శిటీలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబర్ వెల్ఫేర్ స్కూల్స్‌తో పాటు కస్తూర్భా విద్యాలయాలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 60,000 మంది కాంట్రాక్ట్ 2,45,000 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారన్నారు. రోజు కూలి కంటే తక్కువ వేతనం రోజుకు రూ.400 వేతనంతో నేడు డిగ్రీలు, పీజీలు చేసిన గ్రాడ్యుయేట్లు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 50 వేలమంది టీచరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చెయ్యకుండా ఉన్న పోస్టులను ▶ 2లో

పోలీసు హెచ్చరికలున్నా..
తగ్గేదేలే.!



◆ కోడిపందేలకు సిద్ధమవుతున్న బరులు

◆ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో నిర్వహణ



భట్టిప్రోలులో కోడిపందేల కోసం సిద్ధం చేసిన బరి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, భట్టిప్రోలు

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలకు నిర్వాహకులు సన్నద్ధం అవుతు న్నారు. పందేలు, జూదాలను సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీ సులు ఎంతగా చెబుతున్నా.. గతంలో ఎక్కడెక్కడ అయితే కోడిపందేలు నిర్వహించారో ఆయా ప్రాంతాల్లోనే కోడి పందేలకు కావలసిన అన్ని ఏర్పాట్లూ చేశారు. ముందుగా భోగి పండుగ రోజు పోలీసులు అభ్యంతరం చెప్పని పొట్టేళ్ల పోటీ, ముగ్గుల పోటీల లాంటివి పెట్టి ఆ తరువాత కోడిపందేల నిర్వహణకు సన్నద్ధమవుతున్నట్లు చెబుతున్నారు.

ప్రధానంగా రేపల్లె, భట్టిప్రోలు ప్రాంతాల్లో గ్రామాల వెలుపల, అంతగా జన సంచారం ఉండని కృష్ణా నది పరివాహక ప్రాంతంలో కోడి పందేలకు బరులు సిద్ధం చేస్తున్నారు. భట్టిప్రోలు మండలం, పల్లెకోనలో గ్రామం నుంచి రాచూరు వెళ్లే మార్గంలో సుమారు 20 ఎకరాలల్లో కోడిపందేలకు సిద్ధం చేస్తున్నారు. కొత్త వారిని అటు వైపు రానీయకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అధికార ▶ 2లో



కుక్కల దాడితో మృతిచెందిన గొర్రెలు

గొర్రెల మందపై కుక్కల దాడి

48 జీవాలు మృతి

7లో ▶



సంక్రాంతి కళ

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో గురువారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ విజయకృష్ణన్ హాజరయ్యారు.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

'వెలుగొండ' ప్రాజెక్టుకు
రూ.3 వేల కోట్లు ఇవ్వాలి

సిపిఐ(ఎం) జిల్లా

ప్లీనం డిమాండ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వెలుగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయటానికి రూ.3 వేల కోట్ల నిధులు ఇవ్వాలని సిపిఎం జిల్లా ప్లీనం డిమాండ్ చేసింది. సిపిఎం కార్యకర్తల వర్క్ షాప్, జిల్లా ప్లీనం సమావేశం స్థానిక సుందరయ్యభవనంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్లీనం తీర్మానాలను జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేసి, నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. మూడు బడ్జెట్లు పూర్తయినా ప్రాజెక్టు నిర్మాణానికి సరిపడా నిధులు ఇవ్వకపోవటంతో పనులు పూర్తి కాలేదన్నారు. రెండో టన్నెల్, బూస్టల్ కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించలేదన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన మొదటి దశ పనులన్నీ పూర్తి కావాలంటే రూ.3 వేల కోట్లు కావాలని అధికారులు చెబుతున్నారన్నారు. గత సంవత్సరం కేటాయించిన నిధులు సరిపోక ప్రస్తుతం బకాయిలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పశ్చిమ ప్రాంతంలోని కరువు పరిస్థితిని దష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు నిర్మాణానికి కనీసం రూ.3 వేల కోట్లు గ్రాంటు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించే చర్యలు మొదలయ్యాయని, పేదలకు ఇచ్చిన భూములను కాజేయడానికి ఉద్దేశించిన ధర్మాన ప్రసాదరావు కమిటీ రద్దు చేయాలన్నారు. అసైన్డ్ భూములను ఆక్రమణల నుండి కాపాడి పేదలకు దక్కేలా చర్యలు చేపట్టాలని కోరారు. 9/77 చట్టానికి తూట్లు పొడిచే రాష్ట్ర ప్రభుత్వ చర్యలను సిపిఎం నిరసిస్తోందన్నారు. మాండూస్ తుఫాన్ కారణంగా పంట పూర్తిగా దెబ్బతిన్న పొగాకు రైతులకు ఎకరాకు రూ.25 వేలు, ▶ 2లో

పోలీసు హెచ్చరికలున్నా.. తగ్గేదేలే.!

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నేతల కనుసన్నల్లో జరిగే ఈ కోడి పందేలను ఆ ప్రాంత పోలీసులు కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. సంక్రాంతి పండుగ సమయంలో సాంప్రదాయ క్రీడలను వదిలి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలైన కోడి పందేలు వంటి వాటిలో పాల్గొని ఆర్థికంగా నష్టపోతున్నారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాత్రం జిల్లాలో కోడిపందేలు, జూదం ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెబుతున్నారు. గతంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో ఏయే ప్రదేశాలలో కోడిపందేలు నిర్వహించారు? ఇప్పుడు ఎక్కడ నిర్వహిం చేందుకు అవకాశం ఉందో గుర్తించామని అంటున్నారు. కోడి పందేలు నిర్వహించడానికి అవసరమైన కోడి కత్తులను సరఫరా చేసే వారిపై, తయారు చేసే వారిపై నిఘా పెట్టారు. గతంలో కోడిపందేలు ఆడుతూ పట్టుబడిన 968 మందిని బైండోవర్ చేశారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొంటున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లేదా ఎస్పీ బాపట్ల హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228 కు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ చెబుతున్నారు.

'వెలుగొండ' ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

పాక్షికంగా దెబ్బతిన్న వారికి రూ.10 వేలు చొప్పున నష్టపరిహారాన్ని పొగాకు బోర్డు ద్వారా చెల్లించాలన్నారు. వడ్డీ లేకుండా రుణాలను రీషెడ్యూల్ చేసి అదనంగా బ్యారెన్‌కు రూ.లక్ష వడ్డీ లేని రుణం ఇవ్వాలన్నారు. పొగాకు పంటకు ఫసల్ బీమా వర్తింపజేయాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులందరినీ గుర్తించే విధంగా ఎన్యుమరేషన్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలన్నారు. పట్టభద్రులు, గ్రాడ్యుయేట్ల ఓటర్ల జాబితా మరోసారి సమగ్రంగా పరిశీలించి, అనర్హుల ఓట్లు తొలగించాలన్నారు. ప్లీనం సమావేశానికి వివిధ మండలాలు/పట్టణాల నుండి ప్రతినిధులు పాల్గొని రాబోయే కాలంలో నెరవేర్చాల్సిన కర్తవ్యాలను చర్చించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, షేక్ మాబు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, డి. సోమయ్య, ఊసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

తొలగించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ప్రభుత్వం వైపు చూస్తున్నారన్నారు. సిపిఎస్ రద్దు చేస్తానని, పాదయాత్రలో ఇచ్చిన హామీ నేటికి నెరవేర్చలేదన్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్లు అందరూ తమ మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలన్నారు. శాసనమండలిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన న్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు యస్.రవి, డి. వీరాంజనేయులు, వెంకటేశ్వర్లు, చిన్నస్వామి, ఉమామహేశ్వరి, జెవివి ప్రకాశ్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రాంబాబు, ఎస్ఎఫ్ఐ శశాంక్, హేమంత్ పాల్గొన్నారు.

భారత ఖ్యాతిని చాటిన వివేకానందుడు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

భారతదేశ ఖ్యాతిని 1897 సెప్టెంబరు 11వ తేదీన చికాగోలో సర్వమత మహాసభలో చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి వివేకానందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఉప్పుగుండూరులో వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, వివేకానంద సందేశాలు చెప్పడం తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి వ్యవస్థాపకులు కామిశెట్టి శంకరరావు, సెక్రటరీ పావులూరి శివాజీ, కొల్లా శ్రీనివాసరావు, హెల్త్ సూపర్ వైజరు చిరంజీవి, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ కళలను కాపాడుకుందాం: ఈదర

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

అంతరించి పోతున్న సాంప్రదాయ కళలను కాపాడుకునేందుకు ఎన్‌టిఆర్ కళా పరిషత్ ఏర్పాటు చేసినట్లు ఒంగోలు ఎన్‌టిఆర్ కళా పరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఇంకొల్లులో నిర్వహిస్తున్న పోటీలు నాలుగోరోజు ఉత్సాహంగా జరిగాయి. కోటపాటి కృష్ణ మాష్టారు ఆధ్వర్యంలో గుంటూరు సరస్వతి కోలాట బృందం వారిచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. లక్ష్మీ నరసింహ మహిళా కోలాట సమాజం వారిచే కోలాట ప్రదర్శన జరిగింది. చెన్నుపల్లి నాగేశ్వరరావు మాష్టారు ఉత్సాహవంతమైన పాటలతో కోలాటాన్ని రక్తి కట్టించారు. ఇంకొల్లు శ్రీగౌతమి హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కోయ జాతీయుల వేషధారణలో పాటలు, రైతుల పాటలు, ఎన్‌టిఆర్ వేషధారణలోని పలు పాటలను చిత్రీకరించారు. ఎస్‌వి శివకుమారి ఆధ్వర్యంలో నళిని ప్రియ కూచిపూడి నృత్య



కోయ జాతి వేషధారణలో శ్రీ గౌతమి విద్యార్థుల పాట

కళానికేతన్ ఒంగోలు వారిచే షిరిడి సాయి దివ్య చరితం నాటకం అందరినీ అబ్బురపరిచింది.

నేటి కార్యక్రమాలు

ప్రసన్నాంజనేయ నాదస్వర బృందం గోనుగుంట్ల ఆంజనేయులు నేతృత్వంలో నాదస్వర కచేరి జరగనుంది. న్యూ జనరేషన్ హైస్కూలు కోలాట సమాజం విద్యార్థులచే తన్నీరు అంకమ్మరావు మాష్టారుచే కోలాట ప్రదర్శన



పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలు

జరగనుంది. ఇంకొల్లు ఎంఆర్ఆర్ ప్రకాశం హైస్కూలు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతలహరి ఉంటుంది.

కోకా విజయలక్ష్మి రూపొందించిన భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ హైదరాబాదు వారిచే భామాకలాపం సంగీత నృత్య రూపకం ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు వివరించారు.

'వీరసింహారెడ్డి'ని తిలకించిన తెలుగుదేశం నాయకులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

నందమూరి తారక రామారావు తనయుడు నందమూరి బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి సినిమాను పామూరులోని శేషమహల్ థియేటర్‌లో గురువారం కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి వెలిగండ్ల తెలుగుదేశం నాయకులు గోన ప్రతాప్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా తెలుగుదేశం అభిమానులు, నాయకులు హీరో బాలకృష్ణ నటించిన సినిమాను చూడాలని కోరారు. సమాజంలో జరుగుతున్న పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారని పేర్కొన్నారు.

రెండు గ్రూపుల మధ్య ఘర్షణ.. ఒకరు మృతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కాట్రగుంట పంచాయతీలోని వెంగళపల్లి ఎస్సీ కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి కోళ్ల విషయంలో జరిగిన ఘర్షణలో తాళ్లూరి వినోద్‌కు తలకు తీవ్రగాయాలు కావటంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వైద్యం పొందుతూ గురువారం సాయంత్రం తాళ్లూరి వినోద్(30) మృతి చెందారని బంధువులు తెలిపారు. మృతునికి భార్య రూప, ఇద్దరు సంతానం ఉన్నారు. గాయాలైన పలువురు హాస్పటల్లో చికిత్స పొందుతున్నట్లు ఏఎస్ఐ హాసన్ తెలిపారు.

పొగాకు బ్యార్నీ దగ్ధం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని తువ్వపాడు గ్రామానికి చెందిన రైతు తనుబద్ధి తిరుపతయ్యకు చెందిన పొగాకు బ్యార్నీ ప్రమాదవశాత్తు బుధవారం అర్ధరాత్రి సమయంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు తిరుపతయ్య తెలిపారు. పొగాకు ఆరుదల సమయంలో కాలిన అల్లుడు కర్ర మొద్దుగొట్టంపై పడడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. సంఘటన స్థలానికి మార్కాపురం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు.

కోలలపూడిలో నేడు డాక్టరేట్‌లకు సన్మానం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఉన్నత విద్యనభ్యసించి వివిధ రంగాల్లో పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందిన ప్రముఖులకు కోలలపూడి ఐక్య వేదిక ఆధ్వర్యంలో మండల పరిధిలోని కోలలపూడి గ్రామంలో నేడు సన్మానం జరుగుతుందని గ్రామ ఐక్యవేదిక ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌సిలు కేఎస్ లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రమణ్యం, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రావుల బాపయ్య తదితరులు హాజరవుతారని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

'సెయింట్ ఆన్స్'లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-వేటపాలెం: స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు గురువారం తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌కు పరమేషాచారి ముఖ్య అతిథిగా, జర్మని నుంచి డాక్టర్ హమీద్ డూస్ట్ మొహమ్మదీయన్ స్పీకర్‌గా పాల్గొన్నారని, ఇసిఇ విభాగపతి జగదీశ్ బాబు కన్వీనరుగా, ఇఇఇ విభాగపతి డాక్టర్ అనిల్ కుమార్ రాజేంద్రప్రసాద్ కో కన్వీనరుగా వ్యవహరించారని చెప్పారు. అధ్యాపకులు విద్యార్థులు వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇది మంచి అవకాశం అని తెలియజేశారు. కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చిన అనేక పబ్లికేషన్స్‌పై జ్ఞానాన్ని పొందవచ్చని కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ వేణుగోపాలరావు తెలిపారు.

కృష్ణమోహన్‌తో డిఎస్‌పి శ్రీకాంత్ భేటీ

ప్రజాశక్తి-వేటపాలెం

పర్చూరు నియోజకవర్గం వైసిపి నూతన ఇన్‌ఛార్జిగా నియమితులైన కృష్ణమోహన్‌ను చీరాల డిఎస్‌పి పి శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గురువారం డిఎస్‌పి కృష్ణమోహన్ ఇంటికి వెళ్ళి కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి బాధ్యతలు శుక్రవారం చేపట్టనున్న నేపథ్యంలో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టడానికి పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. కృష్ణమోహన్ నివాసానికి మంత్రులు, వైవి సుబ్బారెడ్డి ఇతర ప్రముఖులు అల్పహారం తీసుకొని వేలాది మంది కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా బయలుదేరనున్నారు. పందిళ్ళపల్లి, వేటపాలెం, చీరాల, కారంచేడు మీదుగా పర్చూరు చేరుకొంటారు. పర్చూరు బొమ్మల సెంటర్ నందు దివంగతనేత రాజశేఖర్ విగ్రహానికి పూలదండలతో ఘనంగా నివాళి అర్పిస్తారు. అక్కడ నుంచి నూతలపాడులో దాదాపు మూడుకోట్లతో టిటిడి నిధులతో నిర్మించనున్న కళ్యాణ మండపానికి శంకుస్థాపన, భూమి పూజా కార్యక్రం చేపడతారు. అనంతరం



అక్కడే భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అనుచరగణం తెలిపారు. ఈ ర్యాలీలో 15 అడుగుల వైసిపి రంగులతో తయారు చేసిన గజమాలలు ఐదు చోట్ల క్రేన్ సహాయంతో వేయనున్నారు. దీంతో చీరాల, పర్చూరు నియోజకవర్గాలలోని ప్రధాన కూడళ్లలో సందడికి భారీగా జన సమీకరణలకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.

మొన్న కొత్తపట్నంలో.. నిన్న శింగరాయకొండలో..

సముద్రంలో పెద్ద బోట్లను వెంటాడిన మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు ● అండగా నిలిచిన మత్స్యకారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

చెన్నై నుంచి పెద్ద బోట్లు వస్తున్నాయని, తమ సంపదను దోచుకుపోతున్నారని కొందరు చెప్పడంతో మత్స్యకారులు ఏకమయ్యారు. ఎలాగైనా చెన్నై నుంచి వచ్చే బోట్లను ఆపాలని నిర్ణయించుకున్నారు. దీనికి మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు మత్స్యకారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బుధవారం కొత్తపట్నం మండలంలో, గురువారం శింగరాయకొండ మండలంలో చెన్నై బోట్లను సముద్రంలోనే తరుముకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. మత్స్య శాఖ జెడి ఏ చంద్రశేఖర్‌రెడ్డి, మెరైన్ సీఐ కిషోర్‌బాబు, శింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయతీలోని పోతయ్య పట్టపు పాలెం నుంచి మెరైన్ పోలీసులు మత్స్య శాఖ అధికారులతో పాటు రెండు బోట్లలో మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లారు. అక్కడ చెన్నై నుంచి వచ్చిన మూడు బోట్లు వేటాడుతుండగా అరుపులు, కేకలు వేసుకుంటూ




చెన్నై పెద్ద బోటును తరుముకుంటున్న మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు

వారిని తరుముకున్నారు. ఎప్పటి వరకు చెన్నై వారికి ఈ ప్రాంతంలో మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా వేట చేసుకోమని చెప్తే అలా చేయకుండా నిబంధనలు ఉల్లంఘించి ఇక్కడ మత్స్యకారులను ఇబ్బందులు పెడుతున్నారని అధికారులు రంగంలోకి దిగడంతో మత్స్యకారులు కూడా వారికి తోడు కావడంతో సముద్రంలోనే బోట్లు వేసుకొని చెన్నై పెద్ద బోట్లను తరుముకున్నారు. ఇలా చెన్నై బోట్లు వస్తే ఇదే పరిస్థితి కొనసాగుతుందని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ దాడుల్లో శింగరాయకొండ మత్స్య శాఖ అధికారి ఎస్‌విఎస్ వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ రేటుకు శ్లాబులు ఇప్పిస్తానంటూ..

గ్రానైట్ ట్రేడర్‌కు రూ.4.5 లక్షలు టోకరా

మార్టూరులో వెలుగు చూసిన ఘరానా మోసం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

తక్కువ రేటుకు గ్రానైట్ శ్లాబులు ఇప్పిస్తానంటూ గ్రానైట్ ట్రేడర్‌కు రూ.4.5 లక్షలు టోకరా వేసిన ఘరానా మోసగాడి ఉదంతం గురువారం మార్టూరులో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. గ్రానైట్ రంగంలో ఎంతోమందిని మోసం చేసి తప్పించుకుని తిరుగుతున్న ఘరానా మోసగాడు ఒకరు గ్రానైట్ శ్లాబులు అడుగు రూ.50కి ఇప్పిస్తానంటూ హైద్రాబాద్‌లో గ్రానైట్ ట్రేడింగ్ చేసే ఓ వ్యాపారికి మధ్యవర్తిగా పరిచయం చేసుకున్నాడు. మార్టూరు ప్రాంతంలోని ఓ గ్రానైట్ పరిశ్రమ నుంచి మూడు లారీల లోడు ఒప్పందం చేసుకున్నాడు. తక్కువ ధరకు గ్రానైట్ స్లాబులు దక్కుతాయనే ఆశతో సదరు ట్రేడర్ ముందు వెనుక ఆలోచించకుండా ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేయడానికి ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో సదరు మధ్యవర్తి మార్టూరు సమీపంలోని జొన్నతాళి ప్రాంతంలో వున్న ఓ గ్రానైట్ పరిశ్రమ యజమానితో అడుగు ఒకటికి రూ.80కి కొనుగోలు చేసేందుకు బేరం మాట్లాడుకొని ముందుగా రెండు లారీలలో గ్రానైట్ శ్లాబులు లోడు చేయించాడు. హైదరాబాద్ వ్యాపారికి మార్టూరు గ్రానైట్ పరిశ్రమ యజమానికి ధర విషయం తెలియకుండా సదరు మధ్యవర్తి జాగ్రత్తపడుతూ గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని ద్వారా లారీలో లోడు ఎక్కించామని ఫోన్లో చెప్పించాడు. అనంతరం మధ్యవర్తి ఇచ్చిన బ్యాంకు ఖాతాకు హైదరాబాద్ నుంచి ట్రేడర్ రూ.4.50 లక్షలు నగదు బదిలీ చేశాడు. డబ్బు కట్టినా కూడా గ్రానైట్ స్లాబు లోడు లారీలు బయలుదేరిన సమాచారం రాకపోవడంతో అనుమానం వచ్చిన గ్రానైట్ ట్రేడర్ ఫ్యాక్టరీ యజమానికి ఫోన్ చేయగా తనకు నగదు అందకుండా ఎలా లోడు పంపిస్తానని చెప్పడంతో సదరు మాయగాడికి ఫోన్ చేయగా మధ్యవర్తి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు. మార్టూరు ప్రాంతంలో ఈ తరహా మోసాలు తరచూ జరుగుతున్నా విషయం బయటకు వస్తే పరువు పోతుందని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. కాగా జరిగిన ఉదంతంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని మార్టూరు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఆరు లక్షల రూపాయల అపరాధ రుసుం విధింపు

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలో పలుచోట్ల గురువారం విద్యుత్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న వారికి 6.09 లక్షల రూపాయలు అపరాధ రుసుం విధించినట్లు ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హైమావతి విలేకర్లకు వెల్లడించారు. పందిళ్ళపల్లి, రామానగర్, దేశాయిపేట, నూలుమిల్లు, అక్కాయపాలెం ప్రాంతాల్లో ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 70 మంది



విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు వివరించారు. తనిఖీల అనంతరం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి వివరాలు మీడియాకు తెలిపారు. ఎంతటి వారైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమార్కుల గురించి 9440812198, 9440812359, 7382623185 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఇఇ కె సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

గ్రంథపాలకుడిపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు గ్రంథపాలకుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం పంగులూరులో విలేకరులతో మాట్లాడుతూ, గ్రంథ పాలకుడు ఎనిమిది నెలలుగా గ్రంథాలయానికి రాకపోయినా, అధికారులు చర్యలు తీసుకోవటం లేదని, అధికారులు నిర్లక్ష్యం వల్లనే గ్రంథపాలకుడు డ్యూటీకి రావటం లేదని రామారావు విమర్శించారు. గ్రంథపాలకుడు చేసే తప్పులో జిల్లా గ్రంథాలయ అధికారుల పాత్ర కూడా ఉందని అన్నారు. గ్రంథపాలకుడు సంజీవరావును ఇప్పటివరకు పంగులూరు గ్రంథాలయానికి ఇన్‌ఛార్జి అని, సంతరావూరు గ్రంథాలయానికి రెగ్యులర్ ఉద్యోగి అని చెబుతూ వచ్చిన అధికారులు అసలు విషయం ఇప్పుడు బయటపెట్టారని, పంగులూరుకు అతను రెగ్యులర్ ఉద్యోగి అని రామారావు చెప్పారు. 8 నెలల నుంచి గ్రంథాలయానికి రాకుండా దొంగ సంతకాలు పెట్టుకుంటూ జీతం తీసుకుంటున్నా అతనిపై అధికారులు ఎలాంటి చర్య తీసుకోలేదని, ఇందులో మతలబు ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. రెండునెలల క్రితం పంగులూరు గ్రంథాలయాన్ని పరిశీలించడానికి వచ్చిన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి కోటేశ్వరికి పరిస్థితిని వివరించినా ఎలాంటి చర్య తీసుకోకపోగా, అతని సమర్థిస్తున్నారని రామారావు విమర్శించారు. 8 నెలలు గ్రంథాలయాన్ని తీయకపోవడం వలన విలువైన పుస్తకాలన్నీ చెదలు పట్టిపోతున్నాయని అన్నారు. మద్యం సేవించి గ్రంథాలయానికి ఎప్పుడో ఒకసారి వస్తున్నాడని, అతన్ని సక్రమంగా ఉద్యోగం చేయించడంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికైనా గ్రంథ పాలకుడిపై కఠినమైన చర్యలు తీసుకొని, మరొకరిని పంగులూరు గ్రంథాలయానికి నియమించాలని రామారావు కోరారు.



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న బాచిన కృష్ణచైతన్య

అభివృద్ధికి ప్రాధాన్యం: కృష్ణ చైతన్య

ప్రజాశక్తి-బల్లికురవ

నవరత్నాలతో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూనే, గ్రామాల అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. గురువారం మండలంలోని పాత మల్లయ్యపాలెం గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రధానంగా పంచాయతీ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, సైడ్ కాలువలను ప్రారంభించారు. అలాగే రూ.22 లక్షలతో నిర్మించిన ఆర్‌బికే భవనాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా కష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం లేదని ప్రతిపక్షం పదేపదే విమర్శలు చేస్తోందని అన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయ నిర్మాణం, రైతు భరోసా కేంద్రం, నాడు నేడుతో విద్యాసంస్థల అభివృద్ధి, విలేజ్ క్లినిక్స్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పరిపాలన ప్రజల చెంతకు చేర్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ చూసి ప్రజలు జగన్మోహన్‌రెడ్డికి తోడుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణ, ఏఈ హనుమంతరావు, గ్రామ సర్పంచ్ జూపల్లి రాఘవరావు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, చింతల శ్రీనివాసరావు, కన్వీనర్ చింతల పేరయ్య ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మృతి చెందిన శ్రీవిద్య

శ్లాబు కూలి ఇద్దరు మహిళలు మృతి

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు అద్దంకమ్మ దేవస్థానం బజారులోని పవన్‌సాయి అపార్ట్‌మెంట్ కింద పోర్టికో శ్లాబు కూలి ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. అపార్టుమెంటులో నివాసం ఉంటున్న చాగంటి శ్రీవిద్య(38) పోర్టికో కూలి అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ కొల్లా అనూరాధకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను గుంటూరు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. శ్రీవిద్య భర్త దేవదాయ శాఖలో పని చేస్తున్నారు. శ్రీవిద్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అపార్టుమెంటు నిర్మించి పది సంవత్సరాలు అయిందని, ప్రమాద భరితంగా తయారైందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అపార్టుమెంటులోని వారు భయభ్రాంతులకు గురై బయటకు వచ్చేశారు. అపార్టుమెంటు నాణ్యత సరిగా లేదని, అనేకసార్లు మరమ్మతులు చేపట్టినట్లు నివాస ప్రాంత ప్రజలు వివరించారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

ప్రజాశక్తి-పర్చూరు



వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డిఎస్పీ శ్రీనివాసరావు

పర్చూరు ఇందిరాకాలనీలో మతి స్థిమితం లేని 19 సంవత్సరాల యువతిపై అదే కాలనీకి చెందిన 31 సంవత్సరాల యువకుడు లైంగికదాడికి పాల్పడిన సంఘటన సంఘటన గురువారం పర్చూరులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. కాలనీలో జనసంచారం లేని సందర్భంలో బలవంతంగా యువతిని ఇంట్లోకి లాక్కెళ్లి లైంగికదాడి చేశాడని బాపట్ల డిఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్టూరు సిఐ ఫిరోజ్ కేసు దర్యాప్తు చేసున్నారన్నారు. యువతిని వైద్య పరీక్షల నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకొని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు వివరించారు. ఆడపిల్లలను ఇంటి వద్ద ఒంటరిగా వదిలి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని డిఎస్పీ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

ప్రజాశక్తి-పంగులూరు



గాయపడ్డ హనుమంతరావు

మందులు తీసుకుని టీవీఎస్‌పై ఇంటికి వెళ్తున్న ఒక వృద్ధుడిని, జాతీయ రహదారిపై బైక్ ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం ఉదయం జాతీయ రహదారిపై, అలవలపాడు క్రాస్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన నీలం హనుమంతరావు, మందులు తీసుకొచ్చుకునేందుకు ఉదయాన్నే టీవీఎస్‌పై మేదరమెట్ల వెళ్లాడు. మందులు తీసుకొని తిరుగు ప్రయాణంలో కొప్పెరపాడు వెళ్లేందుకు అలవలపాడు క్రాస్ వద్దకు వచ్చి, జాతీయ రహదారిని దాటుతుండగా, మార్టూరు వైపు నుంచి బైకుపై వస్తున్నా ఒక వ్యక్తి టీవీఎస్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హనుమంతరావు కాలు విరిగి, ఎముకలు బయటికి వచ్చాయి. బైక్ నడుపుతున్న వ్యక్తికి కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన హనుమంతరావును 108 వాహనంలో ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

రెండు నెలలుగా జీతాలు లేవు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

తమకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ క్లాప్ ఆటో డ్రైవర్లు అన్నారు. గురువారం బాపట్ల మునిసిపల్ కార్యాలయ ఆవరణలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 2 నెలల జీతాలు రాలేదని అన్నారు. రెడ్డి ఎంటర్ ప్రైజెస్ సంస్థ తమ వద్ద రూ.లక్ష కట్టించుకొని ఉద్యోగం ఇచ్చారని అన్నారు. నెలకు రూ.18,500 జీతం కటింగ్‌లు అన్నీ పోగా అని చెప్పి రూ.9,270 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై అడిగితే ఉద్యోగంలో నుంచి తీసేస్తామని బెదిరిస్తున్నట్లు వాపోయారు. అప్పు చేసి లక్ష ఇచ్చి తక్కువ జీతంతో పని చేస్తున్నామని బాధను వ్యక్తం చేశారు. చాలీచాలని జీతంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ఇంటి అద్దె, పిల్లల బడి, ఫీజులు తల్లిదండ్రుల మందులకు ఈ ఆదాయం చాలక అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయకపోతే బ్రతుకు ఛిద్రం అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, క్లాప్ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఏ. శ్రీనివాసరావు, కార్యదర్శి జంగం జాన్సన్, యూనియన్ సభ్యులు మాట్లాడారు.



వినతి పత్రం అందజేస్తున్న దుడ్డు వెంకటేశ్వర్లు

సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి

ప్రజాశక్తి-చీరాల

నాలుగో తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ సంక్షేమ శాఖల నాలుగో తరగతి ఉద్యోగులు మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు దుడ్డు వెంకటేశ్వర్లు సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రటరీను కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం అమరావతిలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని పలు సమస్యలపై ఆమెకు వినతిపత్రం అందజేశారు. కొత్త జిల్లాలు ఏర్పడ్డాక అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ కార్యాలయ పాయింట్లలో రెగ్యులర్ క్లాస్ ఫోర్ ఉద్యోగులకు ఇంతవరకు జీతాలు అందలేదని అన్నారు. సంక్రాంతి, దసరా మరియు వేసవి సెలవుల్లో పనిచేసిన 4వ తరగతి ఉద్యోగులకు సంపాదిత సెలవులను అన్ని జిల్లాలలో ఒకే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. సోషల్ వెల్ఫేర్ కాలేజీ హాస్టల్స్‌లో పనిచేస్తున్న సర్వీసు అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు సుమారుగా 38 నెలల నుంచి జీతాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హెచ్‌డబ్ల్యుఓకు బుధవారం వీక్లీ ఆఫ్ ఇచ్చిన విధంగా నాలుగో తరగతి ఉద్యోగులందరికీ వీక్లీ ఆఫ్ అమలు చేయాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు.

నాగులులప్పలపాడు ఎస్ఐగా హరిబాబు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులప్పలపాడు ఎస్ఐగా హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, మెడికల్ శెలవుపై వెళ్లారు. జిల్లా ఎస్‌పి మలికగర్గ్ ఉత్తర్వుల మేరకు హరిబాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిబాబు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ముఖ్యంగా నాగులుప్పలపాడు మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో విధులు నిర్వహించి, ప్రజలతో మమేకం అవుతామన్నారు. అంతేకాకుండా మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను చట్ట పరిధిలో మాత్రమే పరిష్కరిస్తామని ఎస్ఐ తెలిపారు.

ప్రారంభం ఆర్భాటం.. నిర్వహణ అంతంతమాత్రం

ఉనికి కోల్పోతున్న అమూల్ డెయిరీ

ప్రజాశక్తి-పంగులూరు

ప్రజలు అమూల్ డెయిరీ ద్వారా పాల ఉత్పత్తిని పెంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన మాటలు పంగులూరు మండలంలో అనతి కాలంలోనే అపహాస్యం పాలయ్యాయి. అధికారులు, నాయకులు హడావిడి చేసి ఆర్భాటంగా ప్రారంభించిన అమూల్ మిల్క్ చిల్లింగ్ సెంటర్లు కొన్ని అప్పుడే మూతపడ్డాయి. ఉన్న కొద్దిపాటి సెంటర్లు కూడా అరకొరగానే నడుస్తున్నాయి. అమూల్ డెయిరీ ద్వారా పాల ఉత్పత్తులు పెంచుకోవచ్చని ఆశించిన పశుపోషకులకు నిరాశే ఎదురయింది. పంగులూరు మండలంలో గత రెండేళ్ల క్రితం 6 గ్రామాల్లో అమూల్ మిల్క్ చిల్లింగ్ సెంటర్లను అధికారులు ప్రారంభించారు. రేణింగివరం, కొండమూరు, జాగర్లమూడి వారి పాలెం, ముప్పవరం, కోటపాడు, కొండమంజులూరు గ్రామాల్లో ఈ కేంద్రాలను అధికారులు హడావిడిగా ప్రారంభించారు. పాడి రైతులు అమూల్ కేంద్రాలకే పాలు పోయాలని, అమూల్ కేంద్రాల ద్వారా పాడి రైతులకు అనేక సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు చెప్పారు. మండల స్థాయిలో ఎంపీడీవో, తహశీల్దారు ఇంకా అనేకమంది అధికారులు పాల కేంద్రాలను పర్యవేక్షించి, పాడి రైతులను అమూల్ సెంటర్లకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే మండలంలో అమూల్ పాల చిల్లింగ్ సెంటర్లో ప్రారంభించిన మూడు నెలలకే కొండమంజులూరు, ముప్పవరం, జాగర్లమూడి వారి పాలెం సెంటర్లు



అమూల్ పాల కేంద్రంలో పాలు పోస్తున్న మహిళ

మూతపడ్డాయి. మిగిలిన మూడు సెంటర్లలో కూడా పాలు నామమాత్రంగానే వస్తున్నాయి. సుమారు 150 నుంచి 200 లీటర్ల లోపే మొత్తం పాలు వస్తున్నట్లు తెలుస్తుంది. ఈ పాల కేంద్రాల్లో పాలు పోసేందుకు పాడి రైతులు సుముఖత చూపటం లేదని, బయట కేంద్రాలకు పాలు పోసేందుకు ఇష్టపడుతున్నారని తెలిసింది. అమూల్



కేంద్రాల్లో సక్రమంగా డబ్బులు ఇవ్వకపోవడం, వెన్న శాతం కూడా రకరకాలుగా వేస్తున్నట్లు కొంతమంది 'ప్రజాశక్తి'కి తెలిపారు. అంతేకాకుండా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు పశు పోషకులకు పాడి గేదెలు కొనుగోలు చేసేందుకు రుణాలు ఇస్తామని చెప్పిన అధికారులు, తరువాత ముఖం చాటేశారని, అందువలన తాము గేదెలు కొనుగోలు చేయలేకపోయామని, అందువలన అమూల్ కేంద్రాలకు పాలు తీసుకువెళ్లటం లేదని తెలిపారు. ఈ కారణాల వల్ల అమూల్ కేంద్రాలు వెలవెల పోతున్నాయి. అంతేకాకుండా ఇందులో కూడా రాజకీయాలు చొరబడి కొంతమంది ఈ కేంద్రాలకు రావడానికి ఆసక్తి చూపటం లేదని తెలుస్తోంది. ఏది ఏమైనా కేంద్రాల ప్రారంభంలో అధికారులు ఇచ్చిన హామీలు, అమలు చేయకపోవడం వల్ల కేంద్రాలు సరిగా పనిచేయడం లేదని పలువురు పశు పోషకులు తెలిపారు.

సాంప్రదాయాల ప్రతీక సంక్రాంతి: ఆర్డీవో సరోజిని

ప్రజాశక్తి-చీరాల

తెలుగు సాంప్రదాయాలను గుర్తు చేస్తూ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న పండుగ సంక్రాంతి పండుగ అని, దీనిని అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆర్డీవో సరోజని అన్నారు. రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక రోటరీ సామాజిక భవనంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలకు తెలుగు రుచులు పిండి వంటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు అనేక రుచికరమైన పిండి వంటలను తయారు చేసి అనంతరం విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో పండుగ విశిష్టత గురించి వివరించారు. అనంతరం ముగ్గులు వేసి గాలిపటాలను ఎగురవేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బాబూరావు, సీహెచ్ బాలవెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, వలివేటి మురళీకృష్ణ, గుర్రం రాఘవరావు, డీవీ సురేష్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: సాంప్రదాయబద్ధంగా సంక్రాంతి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు అన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పర్యవేక్షణలో సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని పెనుమూడి నేషనల్ హైవే సమీపంలోని పొలాలలో గురువారం నిర్వహించిన ట్రాక్టర్ రివర్స్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అతిపెద్ద పండుగైన సంక్రాంతికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పండుగకు ఒక్కొక్క రోజు ఒకో విశిష్ఠత ఉందని పేర్కొన్నారు. పెనుమూడి గ్రామంలో సాంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించుకోవటం ఆనందంగా ఉందన్నారు. వేడుకల్లో భాగంగా ట్రాక్టర్ రివర్స్ పోటీలతో పాటు దక్షిణ భారతదేశంలోని గొర్రె పొట్టేళ్ల ప్రదర్శన పోటీలు నిర్వహించటంతో ఈ ప్రాంతంలో ఆరోగ్యవంతమైన



చీరాలలో అంగన్‌వాడీ ప్రీ స్కూల్ చిన్నారుల సంక్రాంతి సంబరాలు





చీరాలలో గాలిపటం ఎగురవేస్తున్న ఆర్డీవో సరోజిని, రోటరీ ప్రతినిధులు
రేపల్లెలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు

సందడి వాతావరణం నెలకొందన్నారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో భాగంగా 13వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు దక్షిణాది రాష్ట్రాల గొర్రెపొట్టేళ్ల పందెపు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల అనంతరం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివిధ రంగాలలో రాణిస్తున్న పలువురికి సన్మానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ఎంపీటీసీ మేడికొండ సుధాకరచంద్రహాసరావు, నాయకులు షేక్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల: భోగి మంటలు, రేగు పళ్లు, హరిదాసులు, బసవన్నలు అన్ని కలగలుపుకొని వచ్చే సంక్రాంతి పండుగ చిన్నారులకు ఎంతో ఇష్టమైన పండుగ అని 5వ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకున్న సందర్భంగా చీరాల అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 5,10,11 వార్డులలోని అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులతో సంక్రాంతి పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆయా వార్డు కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, గోలి స్వాతి అనిల్ కుమార్, సిడిపిఓ ఝాన్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో సంక్రాంతి పండుగను అందరూ కుటుంబాలలో జరుపుకొని సంతోషంగా ఉండాలని అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలోని ప్రీ స్కూల్ చిన్నారులకు భోగి పళ్లు పోసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ డి కవిత, అంగనవాడీ కార్యకర్తలు కే జయలక్ష్మి, వి కృష్ణకుమారి, కె భారతి, ప్రథమ్ సంస్థ ప్రతినిధి సిహెచ్ సుప్రజ పలువురు పాల్గొన్నారు.

నేడు దగ్గుబాడులో సంక్రాంతి సంబరాలు

రానున్న ప్రముఖులు

ప్రజాశక్తి-కారంచేడు

బాపట్ల జిల్లా కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామంలో నేటి నుంచి నాలుగు రోజులు పాటు సంక్రాంతి సంబరాలు జరగనున్నాయి ఈ సంబరాల్లో భాగంగా ప్రకాశం, బాపట్ల, గుంటూరు మూడు జిల్లాల స్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు జరగనున్నాయని దగ్గుబాడు పంచాయతీ సర్పంచి, సంక్రాంతి సంబరాల నిర్వాహకుడు గేరా రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. వాలీబాల్ పోటీలతో పాటు వివిధ సాంప్రదాయక పోటీలు కూడా నిర్వహిస్తున్నామని ఆయన ప్రజాశక్తికి తెలిపారు. ఈ సంక్రాంతి సంబరాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు బాపట్ల జిల్లా వైసీపీ ఇన్‌ఛార్జి మోపిదేవి వెంకటరమణ, వైసిపి పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త కృష్ణమోహన్, ఉమ్మడి ప్రకాశం జిల్లాల పంచాయతీరాజ్ అధ్యక్షులు కొల్లా వెంకటరావు తదితర ప్రముఖులు ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా రానున్నారని సర్పంచి రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు.



మాట్లాడుతున్న వినోద్

స్ఫూర్తిప్రదాత వివేకానందుడు

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్

ప్రజాశక్తి-చీమకుర్తి

వివేకానందుడు యువతకు స్ఫూర్తిప్రదాతని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, డివెఎఫ్ఐల ఆధ్వర్యంలో వివేకానంద 160 జయంతి సంధర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను గురువారం సందర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్‌బాబు మాట్లాడుతూ యువత భుజస్కంధాలపైనే దేశ భవిషత్తు ఆధారపడి ఉందన్నారు. డివైఎఫ్ఐ అందరికీ ఉపాధి అనే లక్ష్యం కోసం పనిచేస్తుందన్నారు. యువత ప్రగతిశీల భావాల వైపు నడవాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి పూసపాటి వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దేవరాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు చిన్నారెడ్డి, డివైఎఫ్ఐ మండల నాయకులు పి.విజయ్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ఆకాష్, బ్రహ్మం, కిషోర్, గోపి, జగదీష్, ఏసుబాబు, ఎబినేజర్, వినయ్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కొండపి

ఒంగోలు డిఆర్ఆర్‌యం స్కూల్‌లో స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపికలు ఈనెల 11న జరిగాయని, అందులో రాష్ట్రస్థాయి పోటీలకు కొండపి హైస్కూల్ విద్యార్థులు ఎంపిక అయ్యారని కొండపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ అరుణ తెలిపారు. అండర్-14 కేటడిరలో కుంచాల అనిత (లాంగ్‌జంప్), కుంచాల ప్రవల్లిక (హైజంప్), సొంగా మయూరి (డిస్కు త్రో) ద్వితీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడం జరిగిందని తెలిపారు. అండర్-17 విభాగంలో పి.ఇషాక్ 400 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, పాత కొట్టు స్పందన 800 మీటర్ల పరుగుపందెంలో, హై జంప్‌లో ద్వితీయ స్థానం, బొజ్జా భరణి జావలింగ్ త్రో ద్వితీయ స్థానం, గుడిపల్లి చెన్నకేశవలు జావిలింగ్ త్రోలో ద్వితీయ స్థానం సాధించి ఈ నెల 20వ తేదీన శ్రీకాకుంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పద్మావతి, పీడీ అరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని

మరో పదేళ్లు పొడిగించాలి

దళిత నేత నీలం నాగేంద్ర డిమాండ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జనవరి 23తో ముగుస్తున్న, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని మరో 10 ఏళ్ల పాటు పొడిగించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. గురువారం మార్కాపురం వచ్చిన నాగేంద్ర స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమాజంలో వెనుకబడిన కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి.. వాటిని ఖచ్చితంగా సంక్షేమం కోసం మాత్రమే అమలు చేయాలన్నది అంబేద్కర్ రాజ్యాంగ సంకల్పమన్నారు. ఈ పదేళ్లలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై జగన్ ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలన్నారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య పాల్గొన్నారు.

నటనా నైపుణ్యాన్ని

కారుమంచి హైస్కూలే నేర్పింది..

ప్రముఖ సినీ దర్శకుడు బి.గోపాల్

ప్రజాశక్తి-టంగుటూరు

తనను తీర్చిదిద్దిన గురువులను ఎప్పటికీ మరువలేనని, కారుమంచి హైస్కూలే తన దేవాలయమని ప్రముఖ సినీ దర్శకులు బి.గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి బి.గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ తన స్వగ్రామమైన ఎంనిడమలూరు నుండి ప్రతిరోజూ మూడు కిలోమీటర్లు నడిచి వచ్చి చదువుకునే వాడినన్నారు. తనకు నటన నైపుణ్యాన్ని కూడా కారుమంచి హైస్కూలే నేర్పిందని సభికుల హర్షద్వానాల మధ్య వ్యాఖ్యానించారు. మా ఊరు అభివద్ధి కమిటీ అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని స్కూల్ ఆవరణలో నిర్వహించేందుకు అనుమతినిచ్చి చివరి నిమిషంలో జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు అనుమతి నిరాకరించడం బాధాకరమన్నారు. రాజేష్, బేగం బందం ఆలపించిన అభ్యుదయ గీతాలు సభికులను ఎంతగానో అలరింపచేశాయి. అనంతరం పూర్వ విద్యార్థులందరూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డి కష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఆర్ ఉషారాణి తదితరులను కలిసి పాఠశాల అభివద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మన్నం శ్రీనివాస్, ప్రభుత్వ అదనపు కార్యదర్శి నూతలపాటి శ్రీనివాసులు, అదనపు ఎస్పీ ఆత్మకూరి వెంకటేశ్వర్లు, ఆభరణ్ జ్యువెలర్స్ ఎండి పావులూరి శ్రీలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రముఖ సినీ దర్శకులు బి.గోపాల్

వినుకొండ సుబ్బయ్యకు న్యాయం చేయాలని

పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కనిగిరి

వినుకొండ సుబ్బయ్యకు న్యాయం చేయాలంటూ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసి.కేశవరావు ఆధ్వర్యంలో కనిగిరి సర్కిల్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిసి కేశవరావు మాట్లాడుతూ న్యాయం చేయమని కోరినవారిపై కేసులు పెట్టి..తప్పుచేసిన వారిని పోలీసులు వదిలిపెట్టటం దారుణమన్నారు. ఒప్పందం ప్రకారం వినుకొండ సుబ్బయ్యకు న్యాయం జరిగేలా మిల్లును అప్పగించాలని, సుబ్బయ్యను మోసం చేసిన మోహన్, అతనికి సహకరించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బషీరా, మైమున్, ప్రసన్న, రమణమ్మ, యు పిచ్చయ్య, జి శ్రీను, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

నిరంకుశపాలనకు చరమగీతం పాడాలని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని యడవల్లి గ్రామంలో రాష్ట్రానికి ఇదే ఖర్మ కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు నంబుల వెంకటేశ్వర్లు, ఎం.చెంచిరెడ్డి, బి పుల్లారెడ్డి పాల్గొన్నారు.



'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమంలో పాల్గొన్న ఉగ్ర

ఎన్‌టిఆర్ ఆశయాల కోసం పనిచేయాలి


పామూరు: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సిఎం నందమూరి తారకరామారావు ఆశయాల కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కనిగిరి మాజీ శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం వీరసింహారెడ్డి సినిమా శేషమహల్ థియేటర్‌లో విడుదల సందర్భంగా.. టిడిపి నాయకులు దేవవరపు మాల్యాద్రి కుమారుడు కొండలరావు ఆర్థిక సహాయంతో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని టిడిపి కార్యాలయానికి బహుకరించడం అభినందనీయమన్నారు. అనం తరం సినిమాను కార్యకర్తలతో కలిసి తిలకించారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రహంతుల్లా, సాంబశివరావు, రమణయ్య, అడుసుమల్లి ప్రభాకర్, రామక్రిష్ణ, నాగమల్లేశ్వరరావు, గౌస్‌బాష, రంతుల్లా, ప్రసాద్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి

రూ.7 లక్షల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మండలంలోని బసినేపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో రైతు పేరూరు వెంకటయ్య గతంలో ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు సంబంధించి జగనన్న ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.7 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేసింది. సదరు మొత్తాన్ని గిద్దలూరు శాసనసభ్యులు అన్నా వెంకట రాంబాబు గురువారం రైతు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జడ్పీటిసి బి.వెంకట్ రాజు, గిద్దలూరు ఏడిఏ బాలాజీనాయక్, తహశీల్దార్ కె శాంతి, వ్యవసాయ అధికారి జక్కం మెర్సి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

అభివృద్ధి, సంక్షేమానికి

మళ్లీ పట్టం కట్టండి: మద్దిశెట్టి

ప్రజాశక్తి-దరిశి

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో మరలా వైసిపికి పట్టం కట్టాలని దరిశి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని త్రిపురసుందరిపురం గ్రామంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిశెట్టి పాల్గొని ఇంటింటికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, సర్పంచులు వెన్నపూస అమల, రాము, సుబ్బారెడ్డి, నాయకులు గోళ్లపాటి అచ్చయ్య, తహశీల్దారు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటిండెంట్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటరమణ పర్యవేక్షణలో యర్రగొండపాలెం ఎస్ఐ జి కోటయ్య, పుల్లలచెరువు ఎస్ఐ సుధాకర్, దోర్నాల ఎస్ఐ శ్రీనివాసరావు, మార్కాపురం సెబ్ ఇన్‌స్పెక్టర్ వారి సిబ్బందితో కలిసి పెద్ద పిఆర్‌సి తండా, నరజాముల తండాలలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నాటు సారాకి సంబందించి ఎటువంటి క్రైమ్ ఆనవాలు లభించలేదు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆటోలో మైకు పెట్టి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని ప్రచారం నిర్వహించారు. ఇటీవల గిద్దలూరు, మార్కాపురంలో జరుగుతున్న వరుస దొంగతనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సంక్రాంతి పండుగ సంధర్భంగా ఎవరైనా ఊర్లకు వెళ్తున్నట్లయితే తమకు సమాచారం అందజేయాలని తెలిపారు. సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో రాత్రులందు గస్తీ నిర్వహిస్తూ నిఘా పెడతామన్నారు. ఎస్ఐ జి కోటయ్య ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించగా సచివాలయం-2 మహిళా కానిస్టేబుల్ రాధాదేవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సంబరాలలో చిన్నారులు

సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలో గురువారం నాడు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శింగరాయకొండ ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఆసుపత్రి సిబ్బందికి పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. మూలగుంటపాడు శ్రీ వివేకానంద హైస్కూల్లో కరస్పాండెంట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ విద్యానికేతన్ హై స్కూల్లో కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా చేశారు. ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి శివ నారాయణ, డాక్టర్ చైతన్యకృష్ణ, డాక్టర్ సరస్వతి, సిహెచ్ఓ సోమేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్అలీ పాల్గొన్నారు.

రూ.2.5 కోట్లతో పార్కుల సుందరీకరణ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో పార్కుల సుందరీకరణకు రూ.2.5 కోట్లు నిధులు వెచ్చించి పనులు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలోని సిఆర్‌పి క్వార్టర్స్, గద్దలగుంట పార్కులను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని 16పార్కులను సుందరీకరించాలని నిర్ణయించి పనులు చేపట్టడం జరిగిందన్నారు. సిఆర్‌పి క్వార్టర్స్‌లో పార్కును రూ.25లక్షలతో సుందరీకరించినట్లు వివరించారు. వ్యాయామం కోసం కొత్త వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్,చిన్న పిల్లల క్రీడాపరికరాలు నెలకొల్పినట్లు చెప్పారు. మంగమూరు రోడ్డు జంక్షన్ నుంచి నార్త్ బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్ వరకు సుమారు రూ.30లక్షలతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు తాడికృష్ణవేణి, యనమల నాగరాజు, హార్టికల్చర్ ఎడి వెంకట్రావు, గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటి నాయకులు ఆరిగ శ్రీను, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన..

నగరంలోని చెరువుకొమ్ముపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న 12మంది బాలింతలు కేంద్రానికి రాని పక్షంలో వారికి అందించే భోజనం ఇంటికి పంపించాలని సిబ్బందికి సూచించారు. కేంద్రంలో కరెంటు వసతి, పెయింటింగ్, నేల చదును కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

డివిజన్‌లలో పర్యటన..

నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు గురువారం 50వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ, మూడో డివిజన్ పరిధిలోని బలరాం కాలనీ, మిలటరీకాలనీలలో పర్యటించారు. కమిషనర్ వెంట ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు అంబటి ప్రసాదరావు, గుండు ధనలక్ష్మీ,శానిటరి ఇన్స్‌పెక్టర్ మిరియం శ్రీను, తదితరులు ఉన్నారు.

కమిషనర్ వెంకటేశ్వరరావు



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న బూచేపల్లి

యుటిఎఫ్ భవన నిర్మాణానికి

రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి-దరిశి

దరిశి యుటిఎఫ్ భవన నిర్మాణం నిమిత్తం కీర్తిశేషులు, దరిశి మాజీ శాసనసభ్యులు బూచేపల్లి సుబ్బారెడ్డి జ్ఞాపకారం ఆయన సతీమణి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కుమారుడు దరిశి మాజీ శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రూ.5 లక్షల విరాళాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి, అధ్యక్షులు మీనిగ శ్రీనుకు అందజేశారు. గురువారం చీమకుర్తిలో బూచేపల్లి వెంకాయమ్మ స్వగృహంలో ఈ చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో తాళ్ళూరు మాజీ ఎంపిపి పోశం మధుసూదనరెడ్డి, యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు కామిరెడ్డి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామ్మోహన్‌రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి అంబటి వీరారెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు

ప్రజాశక్తి-పొన్నలూరు

కోడిపందేలు, జూదాలు తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ దాసరి రాజారావు తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని గ్రామాల శివారులలో మరియు ఇతర ప్రాంతాల్లో కోడి పందేలు, జూదాలు మరియు గుండాట నిర్వహించడం నిషేధమని, ఎవరైనా కోడి పందేలు ఆడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సాంప్రదాయం క్రీడలు అయిన కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్‌లతో పాటుగా వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి క్రీడలు నిర్వహించుకోవాలన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-దరిశి

సంక్రాంతి పండుగ సందర్భంగా కళాంజలి ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ అలరించాయి. గురువారం ఈ ముగ్గుల పోటీలను వైఎస్‌ఎంపిపి సోము దుర్గారెడ్డి ప్రారంభించారు. ప్రథమ బహుమతి సోము దుర్గారెడ్డి, ద్వితీయ బహుమతి కర్నా శ్రీనివాసరెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, మూడవ బహుమతిని దారం వాసుదేవరెడ్డి, నాలుగో బహుమతి విష్ణుశ్రావ ఎంటర్‌ప్రైజెస్ వారు ఇవ్వగా బహుమతులు జబర్దస్త్ టీమ్ వారు అందించారు. సాయంత్రం జబర్దస్త్ టీమ్ బుల్లెట్ భాస్కర్, స్నేహ, హరిత, నరేష్ వేసే స్కిటు ఆకట్టుకుంది.

వివేకానంద జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి-తర్లుపాడు

స్వామి వివేకానంద జీవితం నేటితరం యువతకు ఆదర్శమని మండల పరిషత్తు అధ్యక్షురాలు సూరెడ్డి భూలక్ష్మి అన్నారు. నెహ్రూ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక హిందూ పాఠశాల ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమానికి బి.పుల్లయ్య అధ్యక్షత వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు మాదాల కోటేశ్వరరావు వికలాంగ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ బి.శ్రీనివాసులు, రిటైర్డ్ తహశీల్దార్ రామయ్య, వైసిపి జిల్లా నాయకులు సూరెడ్డి రామసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-దరిశి

రైతులు కంది, పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, పొగాకు, మిరప పంటలకు సంబంధించి.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త కె.అన్నపూర్ణ అన్నారు. గురువారం రైతులకు వివిధ పంటలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటరు ఎన్‌వివిఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ పి.ప్రమీలారాణి, జిల్లా వ్యవసాయాధికారి శేషమ్మ, ఎడిఎ అర్జున్‌నాయక్ పాల్గొన్నారు.

అన్నీ సమస్యలే..పరిష్కారమేదీ?

శింగరాయకొండ మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన

ప్రజాశక్తి-శింగరాయకొండ



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మండలంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం దారి కనిపించడం లేదని, ఇన్ని మండల సమావేశాల్లో చర్చ జరిగినా పరిష్కారం దొరకటం లేదని మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో గురువారం ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఎంపిపి కట్ట శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సమావేశంలో కరెంటు సమస్యల మీద ఎన్ని సమావేశాల్లో చెప్పున్నా పరిష్కారం దొరకటం లేదన్నారు. సమావేశంలో చెప్పిందంతా విని వెళ్తున్న అధికారులు బయటకు పోగానే మర్చిపోతున్నారన్నారు. ఇలా ఉండటం వల్ల గత మూడు సమావేశాల నుంచి కరెంటు సమస్యలు అడుగుతుంటే పట్టించుకునే నాథుడే లేరన్నారు. కనుమల్ల, పాకల గ్రామాల్లో కరెంటు సమస్య ఉందని, పశువులు చచ్చిపోతున్నా.. వైర్లు మనుషులకు తగులుతున్నా.. పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. మూలగుంటపాడు తాగునీటి సమస్యపై కోఆప్షన్ సభ్యులు ఎస్డీ సర్దార్ అధికారులను నిలదీశారు. తాగునీటి సమస్య ఉన్న పట్టించుకునే వాళ్ళ లేరన్నారు. శింగరాయకొండ, కందుకూరు మధ్యలో కనుమల్ల దగ్గర రోడ్డు పక్కనే ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని కనుమల సొసైటీ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు సభలో ప్రస్తావించగా.. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తన్నీరు తిరుమలరావు మాట్లాడుతూ ఈ భూమి సమస్యపై సర్వే చేయిస్తున్నామని.. ఆక్రమణకు గురైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యన్నా బత్తిన అరుణ, ఎండిఓ ఎస్కే జమీ ఉల్లా, ఎంఈఓ బి శివ నారాయణ, వైస్ ఎంపిపి షేక్ షకీల, పిఆర్ ఎఈ కోట శ్రీహరి, డాక్టర్ చైతన్యకృష్ణ ,వ్యవసాయ శాఖ అధికారి శేషారెడ్డి, యుఆర్‌డి అంజలిదేవి పాల్గొన్నారు.

సభలో ఇద్దరు సర్పంచులే..

శింగరాయకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మూడు నెలలకు ఒకసారి మాత్రమే జరుగుతుంది. అయితే ఎంపిటిసీలు మాత్రం అంతంత మాత్రంగా వచ్చే సంతకాలు పెట్టేసి.. దర్జాగా వెళ్ళిపోతున్నారు. తమ దృష్టికి సమస్యలు రావు.. పరిష్కారం కావు.. అన్ను రీతిలో ఉన్నారు. నిత్యం గ్రామాల్లో ఉన్న సర్పంచులు సైతం సమావేశాలకు డుమ్మా కొడుతున్నారు. 10 గ్రామపంచాయితీల సర్పంచులు ఉండగా కేవలం శానంపూడి సర్పంచ్ బ్రహ్మయ్య, పాకల సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి మాత్రమే హాజరయ్యారు.

పన్ను పెంపును ఉపసంహరించుకోవాలి

ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రవాణా రంగంపై త్రైమాసిక రోడ్ టాక్స్ పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రమేష్, గంటెనపల్లి శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోకపోగా రహదారుల మరమ్మతుల పేరుతో పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.1 చొప్పున సెస్ విధించిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా రహదారులు మరమ్మతులు చేయలేదని విమర్శించారు. తాజాగా ఇచ్చిన త్రైమాసిక రోడ్ టాక్స్ 30 శాతం పెంపును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా రవాణా రంగ కార్మికులను ఐక్యం చేసి పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. జనవరి 13న లారీ స్టాండ్ వద్ద, డిటిసి కార్యాలయం, కలెక్టరేట్ వద్ద నిరసనలు తెలపాలని, అధికారులకు అర్జీలు ఇవ్వాలని కోరారు.

నాగమునీశ్వరరావు సేవలు అమూల్యం

ప్రజాశక్తి-పిసిపల్లి

డబ్బుకొట్టు నాగమునీశ్వరరావు వైసిపికి చేసిన సేవలు అమూల్యమని శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని గుంటుపల్లిలో గురువారం ఆయన దశదిన కర్మకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ నాగమునీశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ డివి.రమణారెడ్డి, వైసిపి నాయకులు నరాల రమణారెడ్డి, మాజీ సర్పంచులు కేలం సుదర్శనం, మేకల మాల్యాద్రి, ఉండ్యాల వెంగళరెడ్డి, నలగంగుల శ్రీను పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-పిసిపల్లి

రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా రైతులకు శిక్షణ ఇవ్వాలని కనిగిరి వ్యవసాయశాఖ ఎడి ఐవి.రమణ అన్నారు. గురువారం రైతు భరోసా సిబ్బందికి సూచించారు. ఎడిఎ అధ్యక్షతన ఆర్‌బికె సిబ్బందికి గ్యాప్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచ్చల విడిగా వాడకుండా తగ్గించాలని తెలిపినట్లు ఎఒ జి.వెంకటస్వామి తెలిపారు.



అనిల్ అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి, సత్య

అనిల్ మృతి పార్టీకి తీరని లోటు

నివాళులర్పించిన ఎమ్మెల్యే స్వామి, సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

ఒంగోలు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి, పొందూరు గ్రామ ఉపసర్పంచ్ కాట్రగడ్డ అనిల్ (46) అకాల మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. గుండె సంబంధిత వ్యాధితో గత పది రోజుల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన అనిల్‌కు వైద్యులు శస్త్ర చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గురువారం అర్థరాత్రి అనిల్ తుది శ్వాస విడిచారు. గురువారం అనిల్ భౌతికకాయాన్ని స్వగ్రామమైన టంగుటూరు మండలం పొందూరు గ్రామానికి గురువారం తీసుకొచ్చారు. దామచర్ల సత్య అనిల్ మృతదేహాన్ని సందర్శించి.. నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ టంగుటూరు మండల, పట్టణ అధ్యక్షులు కామని విజయకుమార్, కామని నాగ శ్రీను, టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ ఉన్నారు.

వైసిపిని ఇంటికి పంపాలి

దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

ప్రజాశక్తి-దరిశి

వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఇంటికి పంపి.. టిడిపికి పట్టం కడితేనే రాష్ట్రంలో సమన్యాయం జరుగుతుందని దరిశి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. గురువారం శివరాజ్‌నగర్‌లో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలందరికీ న్యాయం జరిగిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో టిడిపికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయితీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మండలపార్టీ అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, నగరపంచాయితీ ఉపాధ్యక్షులు స్టీవెన్, తలారి కోటయ్య, నాయకులు దారం సుబ్బారావు, రత్తయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.



సంబరాలలో పాల్గొన్న మద్దిశెట్టి శ్రీధర్

సాంప్రదాయాలను కాపాడుకోవాలి

పేస్ కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్

ప్రజాశక్తి-టంగుటూరు

ఈ కంప్యూటర్ యుగంలో సంస్కృతి, సాంప్రదాయాలను కూడా కాపాడుకునేలా అందరూ కృషి చేయాలని పేస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం కళాశాలలో మద్దిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో భోగిమంటలు వేసి రంగవల్లులతో ఆనందోత్సాహాల నడుమ సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తెలుగు ప్రజలు అత్యంత వేడుకగా జరుపుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని.. పండుగ విశేషాలను అందరూ ఆస్వాదించాలన్నారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, అడ్మిషన్స్ డీన్ ఆర్ వీరాంజనేయులు, ఏఓ ఎం రమణబాబు, ప్లేస్‌మెంట్ డీన్ కె రూప పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 48 జీవాలు మృతి..
- మరికొన్నింటికి గాయాలు

ప్రజాశక్తి-గ్రోత్ సెంటర్

కుక్కల దాడిలో 48 గొర్రెలు మృతి చెందగా మరికొన్ని గాయపడ్డాయి. ఈ ఘటన మద్దిపాడు మండలంలోని బూరే పల్లిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కన్నెబోయిన గురవయ్య, కన్నెబోయిన కృష్ణవేణి, కొనికి వెంకయ్య 100కు పైగా గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే వారు వేకువ జామున 5 గంటలకు గొర్రెల దొడ్డిని బాగు చేసేందుకు వెళ్లగా అప్పటికే 48 గొర్రెలు మృతి చెంది ఉన్నాయి. మరికొన్ని గాయపడ్డాయి. సుమారు మూడు నుంచి నాలుగు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. తమకు జీవనాధారం గొర్రెలేనని, తమ పుట్టుక నుంచి గొర్రెలను మేపుకుంటూ జీవిస్తున్నామని, ప్రభుత్వం



తమను ఆదుకోవాలని కోరుతున్న బాధితులు

తమను ఆదుకోవాలని వారు కోరారు. గ్రామంలో కుక్కల స్వైర విహారం ఎక్కువైందని, ఇది వరకు నాలుగుసార్లు కుక్కలు మూగజీవాలపై దాడి చేశాయని, ఇకనైనా వాటిని కట్టడి చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న పశు సంవర్థక శాఖ ఏడి పి రామారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కొద్ది రోజుల కిందటే నష్టపరిహారం ఇచ్చే స్కీము రద్దయిందని, మీరు వివరాలు ఇస్తే వాటిని పశు సంవర్థక శాఖ జెడికి పంపిస్తామని తెలిపారు. తమ వంతు ప్రయత్నంగా నష్టపరిహారం వచ్చేలా చూస్తామని అన్నారు. అదేవిధంగా గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే పెద్దబ్బాయి, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరిశీలించిన వారిలో పశువైద్యాధికారి మాధవి, సహాయక సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఎంపీ మోపిదేవిని ఘనంగా సత్కరిస్తున్న గ్రామస్తులు

నూతన సంవత్సరంలో మేలు జరగాలి: మోపిదేవి

ప్రజాశక్తి-నిజాంపట్నం

ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మేలు కలగాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. క్రైస్తవులు అందరూ నూతన సంవత్సర పండుగను జనవరి మాసంలో వారు నిర్ణయించిన తేదీలో జరుపుకోవటం అభినందనీయమని పేర్కొన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నం శివారు థామస్ పేట, ఎక్స్ మిలిటరీ కాలనీ గ్రామస్తులు జనవరి పండుగను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ పండుగ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ మోపిదేవి వెంకటరమణరావు పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలవర్షం కురిపించి తప్పెట్లు, బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న స్వచ్ఛంద సేవా సంస్థల్లో సాల్వేషన్ ఆర్మీ సంస్థ ఒకటి అని పేర్కొన్నారు. ఈ సంస్థ 2004లో సునామీ వచ్చినప్పుడు నిజాంపట్నంలోని ఎస్సీ ఎస్టీ గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులతో పాటు పక్కా గృహాలు నిర్మించి ఇచ్చిందని తెలిపారు. ఈరోజు కార్యక్రమానికి తనను ఎంపీగా కాకుండా గ్రామస్తుడిగా ఆహ్వానించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ గ్రామంలో మిగిలిన సిసి రోడ్లకు ఎస్టిమేషన్ వేసి మంజూరు కోసం పంపామని పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైస్ ఎంపీపీ ఉన్నవ వెంకటేశ్వర్లు (చంటి), ప్యార్లీ మోహన్‌రావు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావును పూలదండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరినాథ్ బాబును, జడ్‌పిటిసిలను పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు నాజర్ ఖాన్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో బొట్లు యూనియన్ ప్రెసిడెంట్ కన్నా శ్రీనివాసరావు, మోపిదేవి శ్రీనివాసరావు, సాల్వేషన్ ఆర్మీ పాస్టర్ మేజర్ డి దేవిజు, వైసీపీ నాయకులు, గ్రామపెద్దలు, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అపర ధన్వంతరి 'యల్లాప్రగడ'

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



యల్లాప్రగడ సుబ్బారావుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

భారతదేశ కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తంగా ఇనుమడింప చేసిన వారిలో యల్లాప్రగడ సుబ్బారావు ప్రముఖులని బాపట్ల సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. అపర ధన్వంతరి యల్లాప్రగడ సుబ్బారావు 128వ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. ఆదివారం బాపట్ల సాహితీ భారతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫోలిక్ ఆమ్ల నిజస్వరూపాన్ని కనుగొని ఆనాడు నివారణ లేని 'స్ప్రూ' వ్యాధికి ఔషధాన్ని కనుగొన్నారన్నారు. బసోనికోటి నికాసిడ్, హైడ్రాక్సైడ్ వంటి మందులు కనుగొని క్షయ, బోధకాలు, టైఫాయిడ్, పాండురోగం తదితర వ్యాధులను పూర్తిగా నిర్మూలింపగల ఔషధాలను కనుగొని విశ్వ మానవాళికి ప్రాణదానం చేసిన వైద్య విధాత అన్నారు. ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ క్లినిక్ ఆధ్వర్యంలో జరిగిన యల్లాప్రగడ సుబ్బారావు 128వ జయంతి సభకు ఫ్రీడమ్ ఫైటర్స్ మెమోరియల్ క్లినిక్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వైద్య రంగంలో ఎనలేని సేవ చేసిన యల్లాప్రగడ వారికి అమెరికా దేశం పౌరసత్వం ఇస్తామని అన్నా దాన్ని కాదని భారత పౌరునిగానే స్థిరపడిన మహోన్నత దేశభక్తుడు యల్లాప్రగడ సుబ్బారావు అని శ్లాఘించారు. ప్రముఖ సాహితీవేత్త దివి శ్రీనివాసరావు మాట్లాడుతూ నివారణ లేని 'స్ప్రూ'వ్యాధితో తన సోదరుడు చనిపోతే అటువంటి దుస్థితి మరెవరికీ రాకూడదని అహర్నిశలు కృషి చేసి 'స్ప్రూ'వ్యాధి నివారణకు మందు కనుగొని మానవాళికి మహోన్నత వరాన్ని ప్రసాదించిన దైవాంశ సంభూతులు యల్లాప్రగడ సుబ్బారావు అని ప్రశంసించారు. ఈ సభలో ఎస్ బాల భాస్కర్, ఆదం షఫీ, మర్రి మాల్యాద్రిరావు, ఎం జాకబ్, పువ్వాడ వెంకటేశ్వర్లు, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, రెంటాల మురళీ రాధాకృష్ణ మూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



ఎస్పీ వకుల్ జిందాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న భావపురి విద్యా సంస్థల వారు

పట్టుదల ఉంటే లక్ష్యాలను చేరుకోవచ్చు: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రపంచంలో సాధ్యం కానిది ఏది ఉండదు, సాధించాలనే పట్టుదల, కసి ఉంటే నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చునని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గురువారం బాపట్లలోని శ్రీ భావపురి విద్య సంస్థలలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజనోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని భావపురి కోచింగ్ సెంటర్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏవిధంగా పోటీ పరీక్షలలో, ప్రిపేర్ అవ్వాలి, ఏవిధంగా ప్రిపేర్ అయితే విజయం సాధించవచ్చు అనే అంశాలపై విద్యార్థులుకు వివరించి వారిలో నూతన ఉత్తేజాన్ని నింపారు. స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో హోంగార్డ్స్, కానిస్టేబుల్స్ మరియు సచివాలయ మహిళా పోలీసులుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా 2023 పోలీస్ రిక్రూట్మెంట్‌లో ఎస్ఐ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారి రాత పరీక్షలకు, ఈవెంట్స్‌కు స్థానిక భావపురి విద్యాసంస్థల వారు ఉచిత శిక్షణను ఇస్తున్నారన్నారు. అధ్యాపకులు చెప్పినవి వింటూ దానికి సంబంధించిన ఇతర సమాచారాన్ని కూడా సేకరించుకోవాలని, అభ్యర్థులు సరైన మెటీరియల్‌ను సమకూర్చుకొని పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలని, సరైన ప్లానింగ్‌తో మోడల్ టెస్ట్‌లు రాస్తూ ఇష్టంతో కష్టపడి ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, రామకృష్ణ సేవా సమితి కర్లపాలెం అధ్యక్షులు తిమ్మరాజు సుబ్బారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీనివాస్, బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి కృష్ణయ్య, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిజి కోర్సులలో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి-చీరాల: స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి పిజి (పోస్ట్ గ్రాడ్యుయేషన్)లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రమణమ్మ బుధవారం తెలిపారు. ఈ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పిజి)లో ఎంకాం, ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్) మరియు ఎంఎస్సీ (కెమిస్ట్రీ) కోర్సులలో సీట్లు ఉన్నాయని అన్నారు. ఇప్పటికీ పిజి చేరని విద్యార్థులు ఉంటే వెంటనే స్పాట్ అడ్మిషన్ కోసం తమ తమ ర్యాంక్ కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా కళాశాల ప్రిన్సిపాల్ కలవాలని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోరారు. ఇతర వివరాల కోసం 9440945039, 9440070492 నంబర్లను సంప్రదించాలి అన్నారు.

అలరించిన జొన్నలగడ్డ సత్యా శ్రీరామ్ గానం

ప్రజాశక్తి-చీరాల: చీరాల పట్టణంలో ఉన్న సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో అయిదో రోజున హైదరాబాద్ వాస్తవ్యులు జొన్నలగడ్డ సత్య శ్రీరామ్ ఆలపించిన కర్ణాటక శాస్త్రీయ గాత్ర సంగీత కచ్చేరి ఆహూతులను ఆనందింపజేసింది. భక్తితత్వంతో త్యాగరాజు కీర్తనలను ఆలపించారు. ఇతర వాగ్గేయకారుల కీర్తనలను శ్రావ్యంగా గానం చేశారు. వీరి గాత్ర కచ్చేరికి వయొలిన్‌పై పెరవలి నందకుమార్ (గుంటూరు), మృదంగంపై పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ (విజయవాడ), ఘటంపై సరస్వతుల హనుమంతరావు తాడేపల్లిగూడెం) అద్భుతంగా సహకరించారు. 5రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమాలను సమితి అధ్యక్షులు డాక్టర్ పోలవరపు వెంకటేశ్వర ప్రసాద్, కార్యదర్శి భాగి నారాయణ శాస్త్రి పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య భారతి సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

వికలాంగురాలికి బాసటగా కలెక్టర్

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

తల్లిదండ్రులను కోల్పోయి నిరాదరణకు గురైన ఒక దివ్యాంగురాలికి జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ అండగా నిలిచారు. తల్లిలా ఆమెకు ఆదరువు చూపి యుద్ధ ప్రాతిపదికన నివాస స్థలాన్ని గురువారం మంజూరు చేసి మానవత్వాన్ని చాటి చెప్పారు. చీరాల మండలం బుర్లవారిపాలేనికి చెందిన పిట్టు మల్లేశ్వరి పుట్టుకతోనే రెండు కాళ్లు లేని దివ్యాంగురాలు. ఆమె సంరక్షణ మొత్తం తల్లిదండ్రులు చూసుకునేవారు. తల్లిదండ్రులు ఇరువురూ ఏడాదిన్నర క్రితం మృతి చెందడంతో నిరాదరణకు గురైన ఆమె తీవ్ర ఇబ్బందులతో బతుకు వెళ్లదీస్తోంది. ప్రభుత్వం నుంచి పంపిణీ చేసే సామాజిక భద్రత పెన్షన్ మాత్రమే ఆమెకు ఆదరువు. అలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం ఆమె సోదరుడి ఇంటి పంచలోనే మనుగడ సాగిస్తోంది. ఈనెల 8వ తేదీన చీరాల మండలం బుర్లవారిపాలెంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పర్యటించారు. ఆ సమయంలో రెండు కాళ్లు లేక నిరాదరణకు గురైన దివ్యాంగురాలిని గమనించి ఆరా తీశారు. చిన్న బంకులో తినుబండారాలు స్వీకరిస్తూ బతుకుతున్నానని కలెక్టర్‌కు దివ్యాంగురాలు మల్లేశ్వరి వివరించారు. కనీసం తలదాచుకోవడానికి సొంత ఇల్లు కూడా లేదని ఆమె కలెక్టర్ వద్ద వాపోయింది. జిల్లా కలెక్టర్ ఆమె దీనస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటి స్థలాన్ని యుద్ధప్రాతిపదికన కేటాయించాలని చీరాల తహశీల్దారు ప్రభాకర్ రావును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో తహశీల్దారు పరిశీలించి ఈపురుపాలెంలో 519 సర్వే నెంబర్‌లోని 48 ఫ్లాట్‌ను మల్లేశ్వరికి మంజూరు చేశారు. తక్షణమే దివ్యాంగురాలైన మల్లేశ్వరిని ఆ ప్రాంతానికి తీసుకువెళ్లి పొజిషన్ చూపారు. పక్కా గృహాన్ని మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆ మేరకు ప్రతిపాదనలు తయారుచేసి తహశీల్దారు గురువారం కలెక్టరేట్‌కు పంపారు. దీంతో జిల్లా కలెక్టర్ తల్లిలా తనను ఆదరించారని వికలాంగురాలు మల్లేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు ప్రభాకర్‌రావు, వీఆర్వో, సర్వేయర్, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇల్లు మంజూరు చేసి చేయూత



మల్లేశ్వరికి కేటాయించిన ఇంటి స్థలానికి పొజిషన్ చూపుతున్న తహశీల్దారు ప్రభాకర్ రావు

● జడ్పీలో సంక్రాంతి సంబరాలు



ఒంగోలులో జిల్లాపరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి..
- ప్రజాశక్తి, ఒంగోలు

అర్హత ఉన్న హెల్పర్స్‌కు పదోన్నతులివ్వాలి

'అంగన్‌వాడీ' జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అర్హత ఉన్న హెల్పర్లకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశం గురువారం జరిగింది ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ పాల్గొన్నారు. సమావేశంలో అర్హత ఉన్న హెల్పర్లకు వెంటనే పదోన్నతులు, తరువాత నోటిఫికేషన్ వెయ్యాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సరం క్రితం పదోన్నతులు ఇవ్వాలని జిల్లాలో ఆందోళన చేశామన్నారు. కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, వారికి పదోన్నతులు ఇవ్వమని కోర్టు ఆదేశాలిచ్చినా పట్టించుకోలేదన్నారు. అర్హత ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలను బదిలీ చేయాలని వారి



మాట్లాడుతున్న ఈదర అన్నపూర్ణ

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ పదోన్నతులపై రాజకీయ ఒత్తిడి చేయడం తగదని, నిబంధనల ప్రకారం హెల్పర్లకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. సమావేశం అనంతరం ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సామ్రాజ్యం, గోవిందమ్మ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో నెం.7తో వీధినపడ్డ కళాకారులు

ప్రముఖ రంగస్థల నటి రత్నశ్రీ ఆవేదన

ప్రజాశక్తి-పిసిపల్లి

జీవో నెం.7తో జానపద, పౌరాణిక నాటకాల కళాకారులు వీధిన పడ్డారని ప్రముఖ రంగస్థల నటి రత్నశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. పిసిపల్లిలో పౌరాణిక నాటకాలు వేసేందుకు గురువారం ఆమె పిసిపల్లి వచ్చిన సందర్భంగా 'ప్రజాశక్తి' ఎదుట ఆవేదన వెలిబుచ్చారు. నాటకాలు ప్రధానంగా చింతామణి నాటం నిషేధంతో సుమారు రెండు లక్షల మంది వీధినపడ్డారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నాటకాలకు క్రమేపి ఆదరణ తగ్గుతున్న సమయంలో కళాకారులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం జీవో నెం.7 పేరుతో చింతామణి నాటకాన్ని నిషేధించడం వల్ల ప్రముఖ కళాకారులు అందరూ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు 20 వేల మంది ప్రేక్షకులను ఆనందపరిచే కళాకారులు నేడు గుమస్తాలుగా, సెక్యూరిటీ గార్డులుగా, వాచ్‌మెన్‌లుగా దయనీయమైన జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం సంవత్సరానికి సుమారు 20 నాటకాలు వేసేందుకు అవకాశం కల్పించిందని, అప్పట్లో చిన్నచిన్న ఆర్టిస్టులకు కొంత ఉపాధి దొరికేదని



మాట్లాడుతున్న రత్నశ్రీ

చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం నాటకాలకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నంది నాటకోత్సవాల పేరుతో ప్రభుత్వం కళలను, కళాకారులను ప్రోత్సహించేదని, వాటిని కూడా రద్దు చేసిందన్నారు. పౌరాణిక చింతామణి నిషేధంతో కళాకారులకు విపత్తు సంభవించిందన్నారు. రోగాలు పెరిగి మందులు కొనలేని దీనస్థితిలో ఉన్నారన్నారు. రంగ స్థలంపై ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన వారు నేడు వెలవెలబోతున్నారని పేర్కొన్నారు. కళాకారుల వద్ద ఏమైనా చిన్నచిన్న పొరపాట్లు ఉంటే సరిదిద్ది కళాకారులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వమే నిషేధం అమలు చేయడం పట్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కొంత మంది ప్రజాప్రతినిధులు కళాకారులైన మమ్ములను మీరు ఏ సామాజిక వర్గానికి చెందిన వారు అంటున్నారని, అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు కళాకారులుగా ఉన్నారన్నారు. కళాకారులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఆమె వెంట మరో కళాకారిణి మనోరమా ఉన్నారు.

108 ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

జిల్లా కమిటీ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుండి సమ్మె చేయ తలపెట్టిన 108 ఉద్యోగుల సమ్మెకు సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ బలపరుస్తుందని, మద్దతు ఇస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రతిపక్ష నాయకుడుగా ఉండి పాదయాత్ర, ఎన్నికల సందర్భంగా 108 కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని సిఎం జగన్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ కాలంలో అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి 108 ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించుకున్న పరిష్కారానికి నోచుకోలేదని, మరోపక్క చిన్న చిన్న కారణాలకి కార్మికులను తొలగించడం, అక్రమంగా బదిలీ చేయడం నిత్య కత్యమైందన్నారు. అనేక సందర్భాల్లో అధికారులతో చర్చ జరిగినా వారి సమస్యల పరిష్కారం కాకపోవటంతో అనివార్యమైన స్థితిలో ఈ నెల 15వ తేది నుండి సమ్మెలోకి పోతున్నారన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు కొరటం లేదని, ప్రధానంగా అరవిందో యాజమాన్యంలో కాంటాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం కాంట్రాక్ట ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నారని, చేస్తున్న పని నిరంతర ప్రమాదంతో కూడుకుందన్నారు. కుటుంబాలు కూడా భయాందోళనతో ఉంటున్నాయని, ఇంటికి తిరిగొచ్చేవరకు భయాందోళనతో కుటుంబాల సభ్యులు ఉంటున్నారన్నారు. సరైన సమయపాలన లేదని, ఈ స్థితిలో గతంలో జగన్మోహన్ రెడ్డి చెప్పిన విధంగా కాంటాక్ట్ కార్మికులందరికీ ఆప్కాస్ లో చేర్చారన్నారు. ఆ విధంగానే 108 ఉద్యోగులను ప్రభుత్వం కాంట్రాక్ట ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. పిఎఫ్ ఈఎస్ఐ యాజమాన్యం కోటా చెల్లించకుండా ఉద్యోగుల వద్ద నుంచి రికవరీ చేయటం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. 12 గంటల డ్యూటీ అమలు జరుగుతుందని, 8గంటల డ్యూటీ అమలు జరపాలన్నారు. అదనపు సమయంలో పనిచేస్తే ఓటి చెల్లించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. .ఉద్యోగ భద్రత కల్పించి పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. డ్యూటీలో ఉన్న ఉద్యోగులకు వసతి సౌకర్యం కల్పించాలని చేస్తున్న సమ్మె న్యాయమైందని వారు తెలిపారు. కండీషన్ బాగాలేక చాలా వాహనాలను భయాందోళన పరిస్థితుల్లో నడిపే స్థితిలో ఏద్యోగులు ఉన్నారని, ఖాళీలు చాలా ఉన్నాయని వాటిని భర్తీ చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న న్యాయమైన సమ్మెను సిఐటియు బలపరుస్తుందని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమ్మెను నివారించాలని సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రమాదాలలో , తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఈ విధంగా పట్టించుకోక పోవటం సరైంది కాదన్నారు. 108 ఉద్యోగులకు అండగా సిఐటియు జిల్లా వ్యాప్తంగా కలిసి పోరాడుతుందని వారు తెలియజేశారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జ్ఞానానికి, పరిపక్వతకు నిదర్శనంగా నిలిచిన స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. వివేకానందుని జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సెంటర్లోని ఆయన విగ్రహానికి ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ వయస్సులోనే విశేష జ్ఞానంతో భారతదేశ గొప్పతనాన్ని విదేశాలలో చాటిన ఘనత వివేకానందుని సొంతమని కొనియాడారు.



స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, మేయర్

ఆయన స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. దేశ సాంస్కృతిక వైభవాన్ని తెలుసుకోవడంతో పాటు సమకాలీన అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. దేశ అభివద్ధిలోనూ యువత వారి వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ విలువలకు, సమున్నత వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలిచిన స్వామి వివేకానందను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టెప్ సిఈఒ బి. బాబూరావు, మెప్మా పీడీ టి.రవికుమార్, జిల్లా విద్యా శాఖాధికారి బి.విజయ భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వ్యవసాయ భూమి కేటాయించాలని

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఎస్సీ, బీసీ కులాలకు చెందిన పేదలతో పాటు భూమి లేని నిరుపేదలకు వ్యవసాయ భూమిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని కోరుతూ మార్కాపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం పశ్చిమ ప్రకాశం జిల్లా కార్యదర్శి గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని వేములకోట గ్రామంలోని ఎస్సీ, బిసి కులాలకు చెందిన పేద ప్రజలకు భూమి లేని నిరుపేదలకు వ్యవసాయ భూమిని కల్పించి పేద రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే తాతలు, తండ్రుల కాలం నుండి సాగులో ఉన్న వారికి 9/77 అసైన్మెంట్ భూమి చట్ట ప్రకారం ప్రభుత్వ భూమిని పేదలకు మంజూరు చేయాలన్నారు. ఒక్క వేములకోట గ్రామంలోనే సర్వేనెంబర్ 982లో సుమారు 112 ఎకరాల భూమి ఉన్నదని, ఈ



ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

భూమిని కొంత మంది పెత్తందారులు కాజేయాలని ప్రయత్నిస్తున్నారని, వెంటనే రెవిన్యూ అధికారులు స్పందించి భూమిలేని నిరుపేదలకు భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప తహశీల్దార్ షేక్ పర్వీన్‌కు వినతిపత్రంను అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, పోరాట కమిటీ కన్వీనర్ మంచాల పకీరయ్య, జూపల్లి బాలరాజు, శివయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, బాలరాజు, శేఖర్, వెంకటేశ్వర్లు, చిలకపాటి పెద్దకోటయ్య, ఏ.కాశీ రావు, సురేష్ బాబు, సున్నం కోటేశ్వరరావు పాల్గొన్నారు.